క్లుప్తంగా

కొనసాగుతున్న జోనల్ స్థాయి క్రీడలు



మరికల్: మూడు జిల్లాలకు సంబంధించిన 9వ జోనల్ స్థాయి క్రీడా పోటీలు మండలంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం రెండోరోజు కొనసాగుతున్నాయి. అండర్ 14, 17, 19 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్, ఇండోర్, బాస్కెట్‌బాల్ క్రీడాపోటీలను నిర్వహించారు. మూడు జిల్లాల టీంలు ఆడుతున్న ఈ పోటీలను అధికారులు తిలకించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



మక్తల్: పట్టణంలో ఉమామహేశ్వర ఆలయంలో భక్తులు అమావాస్య ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం రవిట్రేడర్స్ యాజమాని రవికుమార్‌ఉమాదేవి దంపతుల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తుడు రవికుమార్‌ఉమాదేవిలను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూజారి సిద్దయ్యస్వామి తదితర భక్తులు పాల్గొన్నారు.

కోయిల్‌సాగర్ ఆయకట్టు కళకళ



మరికల్: కోయిల్‌సాగర్ ఆయకట్టు కింద సాగు చేసిన పచ్చని పంటలు పొలాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. మరికల్, ధన్వాడ మండలాల్లో దాదాపు వేల ఎకరాల్లో వరిపంటను రైతులు సాగుచేశారు. కనుచూపుమేర పచ్చని పంటపొలాలు కనువిందు చేస్తున్నాయి.

ఎట్టకేలకు నెరవేరిన కల



మరికల్: ఎన్నోఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న కల ఎట్టకేలకు నెరవేరింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి, గురుకుల పాఠశాలకు వెళ్లే రోడ్డు సీసీరోడ్డుగా మార్చేందుకు గత నెలలో ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. సీసీరోడ్డు పనులకు రూ.20 లక్షలు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ మూడురోజుల వ్యవధిలోనే రోడ్డు పనులు పూర్తిచేయడంతో పాఠశాల, ఆస్పత్రి సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ముగ్గురు బైండోవర్



ఊట్కూర్: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం జూనియర్ అసిస్టెంట్ నిడుగుర్తి వెంకటేష్ ఎదుట వివిధ కేసుల్లో ఉన్న ముగ్గురిని పోలీసులు బైండోవర్ చేశారు. వల్లంపల్లి గ్రామానికి చెందిన వెంకటప్ప, చిన్నపోర్ల గ్రామానికి చెందిన కోట్ల హన్మంతు, దేవరి నర్సింహులను పోలీస్ సిబ్బంది విజయ్ నాయక్ బైండోవర్ చేశారు.

డీటీఎఫ్ మహాసభలను జయప్రదం చేయాలి

ఊట్కూర్: డీటీఎఫ్ మహాసభలను జయప్రదం చేయాలని శనివారం జిల్లా కార్యవర్గ సభ్యురాలు స్పందన ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ పట్టణంలో ఈ నెల 15, 16, 17 తేదీలో మహాసభలు జరుగుతాయని, నారాయణపేట, మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, వనపర్తి, రంగారెడ్డి జిల్లాశాఖల వారు పాల్గొంటారని తెలిపారు. డీటీఎఫ్ కార్యవర్గ సభ్యులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు

- వివిధ రూపాల్లో దర్శనమివ్వనున్న అమ్మవారు



నారాయణపేటలో సుభాష్‌రోడ్డులో దేవాతామూర్తులతో విద్యుత్ అలంకరణలు

నారాయణపేట రూరల్ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆదివారం నుంచి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని సికిల్‌గేరిలోని చౌడేశ్వరీదేవి, ధూల్‌పేటలోని అంబాభవాని, అశోక్‌నగర్ మాలాంభిక దేవి, సింగార్‌బేస్‌లోని కన్యకాపరమేశ్వరీ, సుభాష్‌రోడ్డులోని శక్తిపీఠం, లోకాయపల్లి లక్ష్మమ్మ, గణేష్‌మార్గ్‌లోని మహంకాళి దేవాలయాల్లో వెలిసిన అమ్మవార్లకు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం భారీ శోభాయాత్ర ద్వారా అమ్మవారి ప్రతిమలను పట్టణ శివారులోని కొండారెడ్డిపల్లి చెరువులో జలప్రవేశం చేయిస్తారు.

మక్తల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. పట్టణంలోని కన్యకపరమేశ్వరి ఆలయంలో నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. తొమ్మిదిరోజులపాటు నిర్వహించే నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పాటు అభిషేకం, కుంకుమార్చన, పల్లకీసేవ నిర్వహించనున్నారు. నేడు ఉమాదేవి స్వర్ణకవచాలకృత, 16న అన్నపూర్ణదేవి, 17న సంతానలక్ష్మి, 18న గాయత్రిదేవి, 19న మహాలక్ష్మిదేవి, 20న శ్రీవాసవీ మాత, 21న శాకాంబరీదేవి, 22న మహంకాళీదేవి, 23న కనకదుర్గాదేవి, 24న వాసవీమాత రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు.

ఊట్కూర్: మండలంలోని భవాని మాత ఆలయంలో ఆదివారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు చౌదరి అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం బాలత్రిపుర సుందరి, సోమవారం గాయత్రి దేవి, మంగళవారం అన్నపూర్ణ దేవి, బుధవారం కాత్యాయని దేవి, గురువారం లలితా త్రిపురసుందరి దేవి, శుక్రవారం మహాసరస్వతి దేవి, శనివారం మహాలక్ష్మి దేవి, ఆదివారం దుర్గాదేవి, సోమవారం మహిషాసుర మర్దిని, మంగళవారం రాజరాజేశ్వరి దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు.

నర్వ: నేటి నుంచి ప్రారంభమయ్యే నవరాత్రి ఉత్సవాలకు అన్ని కార్యక్రమాలను చేపట్టినట్లు పెద్దకడ్మూర్ ఆంజనేయస్వామి అర్చకులు ప్రవీణ్‌కడ్మూర్ తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయం ఆవరణలో ప్రతిష్ఠించే అమ్మవారు భక్తులకు ఒక్కో అవతారంలో దర్శనమిస్తారన్నారు. నవరాత్రులకు సంబంధించి అమ్మవారికి కట్టించే వస్త్రాలను ఇదే గ్రామానికే చెందిన మోనేషాచారి దంపతులు అర్చకులకు అందించారన్నారు. ఉత్సవాలను ప్రతినిత్యం తిలకించి అమ్మవారి ఆశీస్సులను పొందాలని ఆయన కోరారు.

దత్తాత్రేయ స్వామి బ్రహ్మోత్సవాలు..

ధన్వాడ: మండల కేంద్రంలోని దత్తాత్రేయస్వామి దేవాలయంలో నేటి నుంచి 22వ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బోర్లశివాజీ, చందు తెలిపారు. పూజలు అందుకునే స్వామివారికి ఈ బ్రహ్మోత్సవాల సమయంలో 1116 దీపాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి 20న బతుకమ్మ సంబరాలు జరుపుతారని తెలిపారు.



ఊట్కూర్‌లో..



నర్వలో అర్చకులకు వస్త్రాలను అందిస్తున్న మోనేషాచారి



నారాయణపేటలో



ధన్వాడలో పూలతో ముస్తాబు చేసిన దత్తాత్రేయస్వామి దేవాలయం



మక్తల్‌లో బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన కన్యకాపరమేశ్వరి ఆలయం



మక్తల్‌లో..



నారాయణపేటలో చౌక్‌బజార్‌లో అమ్మవారి అలంకరణ చిత్రపటాలు

పోలింగ్ బూత్‌లను మార్చాలని తీర్మానం



పోలింగ్ బూత్‌ను మార్చాలని తీర్మానం చేసిన గ్రామస్తులు

కృష్ణా: మండలంలోని ముడుమాల్‌లోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తున్నా పోలింగ్ బూత్‌లను రద్దు చేసి, గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోనే ఏర్పాటుచేయాలని గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, అఖిలపక్షాల నాయకులు తీర్మానం చేశారు. శనివారం వారు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేసి మాట్లాడారు.. ప్రధానంగా ఉన్నత పాఠశాల ఊరికి దూరంగా అడవిలో ఉండడంతో ఓటర్లు అంత దూరం వెళ్లలేక ఓటింగ్‌లో పాల్గొనకుండగా పోయే అవకాశం ఉంటుందని, దానిని గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోనే ఏర్పాటు చేస్తే ప్రజలకు అనుకూలంగా ఉంటుందంటున్నారు. ఇప్పటికే ప్రాథమిక పాఠశాలలో రెండు, ఉన్నత పాఠశాలలో రెండు బూత్‌లు ఏర్పాటుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ విషయంపై అడిషనల్ కలెక్టర్ గ్రామానికి వచ్చిన సమయంలో కూడా ఈ విషయాన్ని ఆయనకు వివరించేందుకు ప్రయత్నించిన వినకుండగా వెళ్లిపోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మరోమారు గ్రామస్తులు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అశోక్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు చెన్నయ్యగౌడ్, బాల్‌రాజ్, వెంకటప్ప, మడుగు వెంకటేష్, అనిల్‌గౌడ్ పాల్గొన్నారు.

వర్షాలు లేక రైతుల కష్టాలు



కాల్వకు ట్రాక్టర్ ద్వారా నీటిని పారబెట్టుకుంటున్న రైతులు

నర్వ: మండలంలో వర్షాకాలం పంటలైన పత్తి, కంది, వరిసాగు చేసుకున్నారు. ఈ వర్షాకాలంలో మండలంలో పత్తి, 22వేల ఎకరాలు, కంది 4వేల ఎకరాలు, వరి 21వేల ఎకరాల్లో సాగుచేశారు. ఈ వర్షకాలం తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో పంటలు ఆశించిన స్థాయిలో దిగుబడి కష్టంగా మారిందని రైతులు వాపోతున్నారు. కిలోమీటర్ల కొద్ది కాల్వలో ఉన్ననీటిని పంటలకు పైపుల ద్వారా పారబెట్టుకుంటున్నారు. ట్రాక్టర్లు, మోటార్ల ద్వారా పైపులైన్‌లను పొ లాలకు కాల్వద్వారా పారబెట్టుకుంటున్నారు. ఈ పాటికే ఎదుగదల లేని పత్తిపంట ద్వారా పత్తిని ఏరుకుంటున్న రైతులు, మరో పక్క కంది పంటకు నీరుపెట్టుకుంటున్న రైతుల బాధలు వర్ణానతీతమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలకు సరిపడా సాగునీటిని కాల్వల ద్వారా పూర్తిస్థాయిలో విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

తాగునీటికోసం రోడ్డెక్కిన మహిళలు



కొత్తపల్లిలో తాగునీటికోసం రోడ్డుపై ధర్నా చేస్తున్న మహిళలు

మద్దూరు: కొత్తపల్లి మండల కేంద్రంలోని గొల్లగేరి, కొత్తపల్లి చౌరస్తాలో దాదాపు వందకు పైగా ఇళ్లకు తాగునీటి సరఫరా కావడం లేదని శనివారం మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించారు. గ్రామానికి రెండు ట్యాంక్‌ల ద్వారా మిషన్ భగీరథ నీటి సరఫరా అవుతుంది. అయితే ఇంటికి సరఫరా చేసే నల్లాలకు స్టాప్‌లను తీసివేయడంతో ఎత్తు ప్రదేశంలో ఉన్నవీరికి నీటి సరఫరా కావడం లేదు. దీనికి తోడు నల్లాలకు మోటార్లు పెట్టడడంతో నీళ్ల సరిపోవడం లేదని వారు తెలిపారు. మాకు తాగునీటి సౌకర్యం కల్పించాలని రోడ్డుపై బైఠాయించడంతో సర్పంచ్ సుభాషిణి స్పందించి కాలనీకి నీటిసరఫరా కోసం కొత్త మోటారు బిగించి సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు. మల్లమ్మ, బాలమ్మ, కిష్టమ్మ, అంజిల మ్మ, శాంతమ్మ, బాలకిష్టమ్మ, దేవమ్మ పాల్గొన్నారు.

ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ



మక్తల్‌లో బతుకమ్మతో వస్తున్న విద్యార్థినులు



నారాయణపేటలో బతుకమ్మతో వస్తున్న చిన్నారి

నారాయణపేట రూరల్ : పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో శనివారం ఎంగిలిపూల బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల చిన్నారులు వివిధ రకాల పూలను సేకరించి అందంగా అలంకరించారు. మైదానంలో ఉంచి బతుకమ్మ పాటలకు బొడ్డెమ్మలు వేస్తూ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విశాలయాదయ్యాశెట్టి, ఉపాధ్యాయలు తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: పట్టణంలోని దయానంద్ విద్యామందిర్‌లో శనివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆడారు.. అనంతరం ఊరేగింపుగా వెళ్లి చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే సంక్షేమ ఫలాలు



ఆత్మకూర్: కాంగ్రెస్ పార్టీతోనే సుపరిపాలన సాధ్యమని, ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడం కాంగ్రెస్‌కే సాధ్యమనే విషయాన్ని ప్రజలు విశ్వసిస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర కల్లుగీత కార్మిక చైర్మన్ కేశం నాగరాజుగౌడ్ అన్నారు. శనివారం ఆత్మకూర్‌లో మాజీ సర్పంచ్ మొగిలి గంగాధర్‌గౌడ్ నివాసంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో కేశం నాగరాజుగౌడ్‌ను కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు అమలు కానీ హామీలతో రాష్ట్ర ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. దేశంలో మతకల్లోహాలు సృష్టిస్తూ వాట్సాప్ గ్రూపుల్లో అబద్ధపు ప్రచారం చేసి విషం చిమ్ముతున్నారని, దేశ సంపదను దోచి అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరిట ఏర్పడిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను నిండా ముంచిందని, కేసీఆర్ కుటుంబానికే నియామకాలు జరిగాయని ధ్వజమెత్తారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాభవం ఎదురుకానున్నట్లు సర్వేల ద్వారా తెలుసుకుని బీఆర్‌ఎస్, బీజేపీ ఎంఐఎంతో జతకట్టి కాంగ్రెస్‌ను దెబ్బతీయాలని కుట్రలు పన్నుతున్న విషయాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

రోడ్డు నిబంధనలు పట్టావా?



ట్రాలీ ఆటోలో పరిమితికి మించి ప్రయాణిస్తున్న ప్రజలు

మాగనూర్: రోడ్డు నిబంధనలు తప్పనిసరి అంటూ అధికారులు ఎన్ని అవగాహన కల్పించినా కొందరు పట్టించుకోవడం లేదు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. పలు గ్రామాలకు బస్సుసౌకర్యం లేని కారణంగా ఆటోలు, జీపులో ఎక్కువ మందిని తరలిస్తూ నిబంధనలు పట్టించుకోవడం లేదు. ఒక ఆటోలో నిబంధనల ప్రకారం ఆరుగురు ప్రయాణించాల్సి ఉంటుంది. ఒకే ఆటోలో 15నుంచి 20 మందిని తరలిస్తున్నారు. అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్ బైక్‌ర్యాలీని జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న రాజేష్

మరికల్: బీఆర్‌ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 16న నిర్వహించే నియోజకవర్గ బైక్‌ర్యాలీని జయప్రదం చేయాలని పార్టీ మండల యూత్ అధ్యక్షుడు రాజేష్, శేఖర్ అన్నారు. శనివారం మండలంలోని ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పాల్గొనే బైక్‌ర్యాలీ మొదట కోయిల్‌కొండ మండలం శేర్‌వెంకటాపూర్ నుంచి ప్రారంభమవుతుందన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ప్రజా సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ సాగుతుందన్నారు. అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, యువకులు తరలివచ్చి బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శివ, కమల్, బాలరాజు, మల్లేష్, రాజు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద వసతుల పరిశీలన

అమరచింత: మండలంలోని పోలింగ్ బూత్‌లను అధికారులు శుక్రవారం సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. తాగునీటితో పాటు విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్ల వసతులు ఎలా ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని మిట్టనందిమళ్ల, మస్తీపూర్, ఈర్లదిన్నె, చింతరెడ్డిపల్లి, గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను శనివారం పరిశీలించారు.

ప్రారంభానికి ముందే ఫ్యాన్లు ధ్వంసం



వానరాల దాడులకు ధ్వంసమైన ఫ్యాన్లు

మాగనూర్: మన ఊరు–మనబడిలో భాగంగా మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్మించిన డైనింగ్‌హాల్‌లోని ఫ్యాన్లు ధ్వంసమైయ్యాయి. అయితే ఈ ఫ్యాన్లను గుర్తుతెలియని దుండగులు ఎవరూ ధ్వంసం చేయలేదు. వానరసైన్యం ఈ పని చేసింది. ఏకంగా ఏడు ఫ్యాన్ల రెక్కలను మొత్తం ధ్వంసం చేశాయి. ప్రస్తుతం గ్రామంలో వానారాలు పదుల సంఖ్యలో ఉన్నాయని వాటితో నిత్యం వ్యాపారస్తులు, గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి కోతులను బంధించి అడవికి తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కలగానే బీటీ రహదారులు



కంకర తేలిన లక్కర్‌దొడ్డి రహదారి



బీటీ లేని జక్కన్నపల్లి రహదారి

నర్వ: మండల కేంద్రంలోని లక్కర్‌దొడ్డి, జక్కన్నపల్లి, కొత్తపల్లి గ్రామాలకు బీటీ రహదారులు కలగానే మారిందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈ మూడు గ్రామాలు మండల కేంద్రానికి 5 కిలోమీటర్ల లోపు దూరంలోనే ఉన్నప్పటికీ మండలానికి వెళ్లేరోడ్లు గోతులతో ఎలాంటి మరమ్మతులకు నోచుకోలేని స్థితిలో ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ప్రతిపనికి మండలానికి వెళ్తుంటామని ఈ నేపథ్యంలో బైక్‌లు, ఆటోలపైనే వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు గుర్తించి ఈ గ్రామాలకు బీటీ రహదారులను మంజూరుచేసి ప్రయాణ ఇబ్బందులను తీర్చాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

పడిపోయిన పత్తి ధర

మరికల్: ఆరుగాలం కష్టపడి పండించిన పత్తికి మార్కెట్‌లో మద్దతు ధర లేక పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. 20రోజుల నుంచి పత్తికి మార్కెట్‌లో మద్దతు ధర లేదు. దీంతో పొలాల్లో రైతులు తీసిన పత్తిని ఇళ్ల, పొలాల వద్దనే నిల్వ ఉంచుకున్నారు. గతయేడాది క్వింటాల్ పత్తి రూ. 7500నుంచి 9500ఉండగా, ఈ ఏడాది రూ. 5,500నుంచి 7020 పలుకుతుంది. పండించిన పత్తిని తక్కువ ధరకు అమ్మేందుకు రైతులు ఇష్టపడటం లేదు. ఈ ఏడాది ఆశించిన మేర వర్షాలు లేకపోవడంతో దిగుబడి తగ్గింది. కనీసం క్వింటాల్‌కు రూ. 8 వేలు ఉండాలని రైతులు కోరుతున్నారు. మద్దతు ధరలేక పంటలకు పెట్టిన పెట్టుబడులు రాని పరిస్థితి వస్తుందని రైతులు ఆందళన వ్యక్తం చేస్తున్నారు.



పొలం వద్ద నిల్వ చేసిన పత్తి

